

## పెరిగిన గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం పెరిగింది. ఉదయానికి 15.780 మీటర్లు ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 15.887 మీటర్లకు చేరింది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే ఎగువన 26.920 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.720 మీటర్ల నీటిమట్టం నమోదైంది. గోదావరి నీటిమట్టం పెరగడంతో స్పిల్ వే రేడియల్ గేట్ల నుండి, స్లూయిస్‌ల నుండి వరద జలాలు దిగువకు విడుదలవుతున్నాయి.

పోలవరం వద్ద గోదావరి ఉధృతి

# సమస్యల సుడిలో సంక్షేమ హాస్టళ్లు

బుట్టాయగూడెం హాస్టల్

పెచ్చులూడిన శ్లాబు

**'నాడూ.. నేడూ'.. అవే సమస్యలు..!**
**అభివృద్ధికి నోచని దుస్థితి**
**శిథిలావస్థలో బుట్టాయగూడెం వసతి గృహం**
**బిక్కుబిక్కుమంటూ చదువులు**
**గదుల్లోకి శ్లాబు నుంచి వర్షపు నీరు**
**పరిసరాలు అధ్వానం**
**ఈగలు, దోమలతో నానా అవస్థలు**
**పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

**ఏజెన్సీలోని సంక్షేమ హాస్టళ్ల సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. విద్యకు తొలి ప్రాధాన్యతనిస్తామన్న ప్రభుత్వ పాలకుల మాటలు ఆచరణలో నీటిమూటలయ్యాయి. ఫలితంగా విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. సరైన వసతులు, రక్షణ లేక, శిథిలావస్థ భవనాల్లో బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా బుట్టాయగూడెం మండలంలోని హాస్టళ్లు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాయి.**

మండలంలోని హాస్టళ్లలో కనీస వసతుల్లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ చదువుకుందామని వచ్చిన విద్యార్థులు ఇక్కడి వసతులు చూసి భయపడుతున్నారు. కొందరు దిక్కుతోచని స్థితిలో ఆ సమస్యల మధ్యే విద్యను నెట్టుకొస్తున్నారు. ముఖ్యంగా బుట్టాయగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో కనీస సౌకర్యాల్లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడ ఐటిఐ, ఎంఎల్‌టి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న 150 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా వంటి సుదూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి కాలేజీలో చదువుకుంటూ ఈ వసతిగృహంలో ఉంటున్నారు. జైలులో ఉన్న ఖైదీలకు వీళ్లకు పెద్ద తేడా లేనివిధంగా వసతులున్నాయని పలువురు వాపోతున్నారు. ఇంకా జైలులోని గదులే బాగుంటాయేమోకాని ఇక్కడి వసతి గృహంలోని గదులు అపరిశుభ్రంగా వ్యాధులకు కారణమయ్యే విధంగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొంత అపరిశుభ్రంగా వసతిగృహాలు ఉండటం వల్ల ఐటిడిఎ పరిధిలో ఎంతోమంది విద్యార్థులు అనారోగ్యంతో, విషజ్వరాలతో, అంటువ్యాధుల వ్యాధులతో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. వాటిని చూసిన తర్వాత కూడా ఇంతమంది విద్యార్థులను ఈ అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో ఉంచడమేనేది ప్రభుత్వానికి గిరిజనుల పట్ల, గిరిజన విద్యార్థుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది.

**శిథిలావస్థలో హాస్టల్ భవనం**

వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబులు పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయి. అనేక చోట్ల శ్లాబు ఐరన్ రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. దీంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు గడుపుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే శ్లాబ్ నుండి నీళ్లు విద్యార్థులపై పడుతున్నాయని, దీంతో రాత్రి సమయాల్లో నిద్రకూడా ఉండటం లేదని పలువురు వాపోయారు. వర్షం నీరు గదుల్లో తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ హాస్టల్ దుస్థితిని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోయారు. సమస్యను తహశీల్దార్ ఎస్ఎస్.శాంతికి విద్యార్థి సంఘాలు, విద్యార్థులు పలుమార్లు వినతిపత్రాలిచ్చి సమస్యను పరిష్కరించాలని కోరడంతో కొంతకాలం క్రితం వసతి గృహాన్ని పరిశీలించి వెళ్లారు తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా ఉన్న గది

**పులిరామన్నగూడెం హాస్టల్ విద్యార్థి హత్యతో ఆందోళన**

ఇటీవల పులిరామన్నగూడెంలోని గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థి హత్యతో విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. హాస్టల్లో నిద్రిస్తున్న విద్యార్థిని హాస్టల్ బయటకు తీసుకెళ్లి అతికిరాతకంగా హత్య చేయడం విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అసలు హాస్టళ్లలో విద్యార్థుల సంరక్షణ ఇంత ఘోరంగా ఉందా అనే విషయం ఈ ఘటన చెప్పకనే చెబుతుంది. హాస్టల్ వార్డెన్, నైట్‌వాచ్‌మెన్ పర్యవేక్షణాలోపం ఈ ఘటనతో తేటతెల్లమవుతుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేయాలని, వారికి మెరుగైన వసతులు, సంరక్షణ కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అంతేకాక ఇక్కడి హాస్టల్లోనూ కనీస వసతుల్లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సరైన తాగునీరుకూడా ఉండటం లేదని, భోజనం అంతంతమాత్రంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు.

**ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం**

బుట్టాయగూడెంలోని హాస్టల్ దుస్థితిని ఉన్నతాధికారులకు వివరించామని ఎటిబ్ల్యూఒ శ్రీవిద్య తెలిపారు. ఐటిడిఎ డీడీ, పిఒలకు తెలియజేశామన్నారు. బుట్టాయగూడెం సమీపంలో ప్రయివేటు భవనాన్ని అద్దెకు తీసుకుని అందులో హాస్టల్ నిర్వహించాలని సూచించారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### పలుమార్లు ఆందోళన చేసినా ఫలితం లేదు

**పి.కామరాజు, ఎంఎల్‌టి ద్వితీయ సంవత్సరం విద్యార్థి, కాచారం, వెలేరుపాడు మండలం**

హాస్టల్లోని సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ధర్నా చేసినా పట్టించుకోలేదు. అనేకసార్లు ఉన్నతాధికారులకు వినతులు అందించాం అయినా ఎలాంటి ఫలితం లేదు. అపరిశుభ్ర వాతావరణం, దోమల బెడదతో నరకయాతన అనుభవిస్తున్నాం.

### వసతులు కల్పించండి

**కారం రాజబాబు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, మారేడుబాక, కుక్కునూరు మండలం**

ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్లోని సమస్యలు పరిష్కరించాలి. ఏడాది కాలంగా ఇక్కడ ఉంటున్నాను. చాలాఇబ్బంది పడుతున్నాను. ఇన్ని సమస్యల మధ్య మా చదువులు కొనసాగించలేం. బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోంది.

### గదుల్లోకి వర్షపునీరు

**వలస చరణ్ తేజ, ఎంఎల్‌టి ద్వితీయ సంవత్సరం, వెంకటరెడ్డిగూడెం పోలవరం మండలం**

చిన్నపాటి వర్షానికి నీరు హాస్టల్ గోడలు, శ్లాబ్ నుండి గదుల్లోకి చేరుతుంది. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో ఉండటం అంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బతకడమే. అధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

ఆందోళన చేస్తున్న ఆశాలు

# సమస్యలపై గళమెత్తిన ఆశాలు

**కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా**
**పనిభారం తగ్గించాలని డిమాండ్**
**వృత్తికి సంబంధం లేని పనులు చేయిస్తున్నారంటూ ఆగ్రహం**
**వర్షంలోనూ కొనసాగిన ఆందోళన**

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆశా వర్కర్లతో సంబంధం లేని పనులు చేయించరాదని, పని భారం తగ్గించాలని గ్రూప్ బీమా సౌకర్యం కల్పించాలని, అధికారుల వేధింపులు ఆపాలని కోరుతూ ఏలూరులోని కలెక్టరేట్ వద్ద ఆశాలు మంగళవారం పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, అధికారుల బెదిరింపులకు వెరకుండా వందలాది మంది ఆశా కార్యకర్తలు ఈ ధర్నాకు తరలివచ్చారు. ఈ ధర్నానుద్దేశించి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆర్.లింగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.పది వేలు ఇస్తుందనే పేరుతో 14 రకాల యాప్‌లు, 26 రిజిస్టర్లు నిర్వహించాలంటూ పనిభారం మోపిందని విమర్శించారు. ఆశా వర్కర్లకు నాణ్యతలేని సెల్‌ఫోన్లు, 2జి సిమ్‌కార్డులిచ్చి ఆన్‌లైన్ వర్క్ చేయాలంటే ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు చేతివాటం ప్రదర్శించి నాణ్యతలేని ఫోన్ ఇచ్చి ఆశాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. నెలకు నాలుగైదు సమావేశాల పేరుతో పిహెచ్‌సిలకు పిలిపించి టిఎ, డిఎలు ఇవ్వకుండా ఆశా వర్కర్లను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని విమర్శించారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ సచివాలయం వద్ద ఉండాలని స్థానిక అధికారులు ఒత్తిడి చేయడం, బానిసలుగా పనిచేయించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ వర్కర్ల జాబ్‌తో సంబంధం లేని పనులు చెబితే తిరస్కరిస్తామన్నారు. యూనియన్ జిల్లా నాయకురాలు కమల మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పని భారం పెరిగి బిపి, షుగర్, గుండె జబ్బులు వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల మరణం చెందినా, ప్రమాదవశాత్తు మరణించినా రూపాయి కూడా పరిహారం ఇవ్వకుండా ఆశాలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం పని భారం తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆశాల సమస్యలపై జిల్లా అధికారులు తక్షణం జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిపిఒ జోషికి వినతిపత్రం అందజేశారు. డిపిఒ మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్‌తో మాట్లాడి జాయింట్ మీటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ధర్నా అనంతరం నినాదాలు చేస్తూ కలెక్టరేట్ నుండి ఫైర్ స్టేషన్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రోజా, లోకేశ్వరి, కామేశ్వరి, కనకదుర్గ, మేరీ, పావని, పరమేశ్వరి, లలిత, అరుణ, విజయ, నాగమణి నాయకత్వం వహించారు. ఈ ధర్నాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కొర్రి విజయలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి పాల్గొని మద్దతు తెలిపారు.

# 21,048 మందికి జగనన్న 'తోడు'

**జిల్లాలో ఏడో విడతలో రూ.22.66 కోట్ల వడ్డీలేని రుణం**
**19,627 మందికి రూ.42 లక్షలు వడ్డీ రాయితీ జమ**

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చిరువ్యాపారులు, సాంప్రదాయ వృత్తులవారి ఉపాధికి ఊతంగా జగనన్న తోడు నిలుస్తోందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మంగళవారం జగనన్న తోడు ఏడో విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించినవారికి సంబంధించిన వడ్డీ రాయితీని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు, జెసి పి.లావణ్యవేణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానియేల్, పలువురు లబ్దిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరువ్యాపారులు, సాంప్రదాయ వృత్తులవారికి జగనన్న తోడు అపన్న హస్తంగా నిలుస్తోందన్నారు. ఏడో విడతలో ఏలూరు జిల్లాలో 21,048 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.22.66 కోట్లు జమచేశారన్నారు. అదే విధంగా రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 19,627 మంది లబ్ధిదారులకు రూ.42 లక్షలు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద లబ్ధిదారులకు జమచేశారన్నారు. చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో ఈ విడతలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో చిరువ్యాపారాలు చేసుకునే 16,448 మందికి వడ్డీలేని రుణాలు మంజూరయ్యాయన్నారు. పట్టణ ప్రాంతంలో 4,600 మందికి ఈ పథకం ద్వారా పూచీకత్తులేకుండా రుణాలు అందిస్తుందన్నారు.

## రెండో సెమిస్టర్ పుస్తకాలు సిద్ధం

**ఎండియు వాహనాల ద్వారా పాఠశాలలకు సరఫరా**
**డిఇఒ పి.శ్యాంసుందర్**

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్లలో ఉన్న రెండో సెమిస్టర్‌కు సంబంధించిన పుస్తకాలను ఎండియు వాహనాల ద్వారా పాఠశాలలకు పంపుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ తెలిపారు. పుస్తకాల పంపిణీకి సంబంధించి ఏలూరు సెయింట్ జెవియర్ ఉన్నత పాఠశాలలో ఉన్న మండల ఎన్‌టి బుక్స్ స్టాక్ పాయింట్‌ను మంగళవారం డిఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగనన్న విద్యాకానుక కిట్లను స్టాక్‌పాయింట్ల నుంచి ఉపాధ్యాయులకు అప్పగించేవారమన్నారు. వారు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో పాఠశాలలకు తరలించుకునే వారని తెలిపారు. దానివల్ల ఉపాధ్యాయులు పలు అవస్థలు పడటాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈ నేపథ్యంలో స్టాకింగ్ పాయింట్ల నుంచి ఎండియు వాహనాల ద్వారా పాఠశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయిందన్నారు. సెమిస్టర్-2 పుస్తకాల పంపిణీ నుంచి ఈ విధానం అమల్లోకి వస్తుందన్నారు. మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభమవుతుందని డిఇఒ చెప్పారు. పంపిణీ సమయంలో ఎంఇఒలు, సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని, పాఠశాలకు అవసరం ఉన్నంత వరకే పంపిణీ జరగాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు అందలేదనే మాట విద్యార్థుల నుంచి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టాక్ పాయింట్లలో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. ఆయన వెంట ఏలూరు ఎంఇఒ ఆర్.రంగయ్య, జెవియర్ పాఠశాల ఆంగ్ల, తెలుగు మాధ్యమ ప్రధానోపాధ్యాయిలు తోట రోజారాణి, రాజ్ ప్రసాద్, సిఆర్‌పిలు దారం సునీత, దివ్య, సంధ్య, ఖాన్, లక్ష్మి పాల్గొన్నారు.

## ఎస్‌సి బాలుర హాస్టల్లో తనిఖీలు

**జీలుగుమిల్లి:**స్థానిక ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని ఫుడ్ కార్పొరేషన్ కమిటీ సభ్యులు గంజిమాలదేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సదుపాయాలను పరిశీలించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను, మెనూ రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సదుపాయాల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.

## 21న నారాయణపురం డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

**ఉంగుటూరు:**నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 21న జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆ కళాశాలల ప్రణాళిక, అభివృద్ధి కమిటీ సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్‌బిఐ లైఫ్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో, ఎయిర్ టెల్ పేమెంట్ తదితర సంస్థలు 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీ యువకులకు ప్రతిభ ఆధారంగా ప్రాంగణ ఎంపికలు చేపట్టనున్నారని ప్రిన్సిపల్ టికె.విశ్వేశ్వరరావు వెల్లడించారు. ఆసక్తి ఉన్న యువకులు bit.ly/ncsregister రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# భూస్వాములతో ఇరిగేషన్ అధికారుల కుమ్మక్కు

**ఎర్ర కాలువ మిగులు భూముల పేదలపై అక్రమ కేసులు, బెదిరింపులు**
**పేదలకు సాగుకు అవకాశం కల్పిస్తూ ఎక్సాల్ పట్టాలివ్వాలి : వ్యకాస డిమాండ్**

ఆందోళన చేస్తున్న పేదలు, నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భూస్వాములతో కుమ్మక్కై పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్టాలను ఉల్లంఘిస్తున్న రెవెన్యూ ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. ఎర్రకాలువ మిగులు భూములకు ఎక్స్‌ఎల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిదేళ్ల నుండి ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై, ఆ ప్రాంతంలో ఉన్న పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. చట్టం అందరికీ సమానమేనని చెబుతూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఇరిగేషన్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇరిగేషన్ భూముల్లో పేదలు సాగు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ భూములు గత 35 ఏళ్లగా స్థానిక భూస్వాములు అమ్ముకుని నేటికీ దర్జాగా వాణిజ్య పంటలు పామాయిల్, కొబ్బరి, చెరకు, మొక్కజొన్న, పొగాకు వంటి పంటలు చట్ట వ్యతిరేకంగా పండిస్తున్నా ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. భూస్వాములు పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. భూముల్లోకి వెళితే పేదలపై అక్రమ కేసులు పెట్టి, మహిళలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవ రత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం, అప్పలరాజుగూడెం, అబ్బుల్లాపురం, సాలిగూడెం, మల్లప్పగూడెం జంగారెడ్డిగూడెం మండలంలో ఎ.పోలవరం, చిన్నవారిగూడెం, తాడువాయి, వేగవరం, చక్రదేవరపల్లి, ఎర్రకాలువ ప్రాజెక్టు ఇరిగేషన్ భూముల్లో పేదలు వేసుకున్న కొబ్బరి మొక్కలు పీకేసి దళిత మహిళలపై దాడి చేసి కొట్టి కులం పేరుతో దూషించిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ భూముల్లో పేదలు ఏడాది నుంచి కొబ్బరి మొక్కలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఇది ఓర్వలేని భూస్వాములు కొబ్బరి మొక్కలు పీకివేసి 'ఆ మొక్కలు మేమే వేశాము.. పేదలు పీకేశారు' అంటూ పోలీస్ స్టేషన్లో పేదలపై తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఇరిగేషన్ భూముల్లో ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయకుండా పేదలపై కేసులు ఎందుకు నమోదు చేశారో పోలీసులు ప్రజలకు తెలియజేయాలని కోరారు. మహిళలపై దాడి చేసిన భూస్వాములపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెలాఖరుకి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఎర్ర కాలువ పోరాటంలో ఉన్న పేదలందరితో కలిసి ఇరిగేషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు టి.సత్యనారాయణ, ఎస్.మహంకాళిరావు, జి.సూర్యకిరణ్, యాగంటి సీత, పి.చంటి, కె.సుబ్బారావు, మొగలి మంగ, తోనం సోమాలమ్మ, రామలక్ష్మి, దుర్గమ్మ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారమయ్యే వరకూ మున్సిపల్ కార్మికుల ఆందోళన

**జంగారెడ్డిగూడెం:**మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ప్రజా సంఘాల కార్యాలయంలో నాయకులు పసల సూర్యారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన మహిళా కార్మికులతో రిలే నిరాహార దీక్షలు, 21న పురుషులతో దీక్షలు చేస్తామని తెలిపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఈనెల 27వ తేదీన మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని తెలిపారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే వచ్చేనెల ఏడో తేదీన కలెక్టరేట్ ముట్టడి, 15 తర్వాత రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి, సంఘ అధ్యక్షులు బి.బాలరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, వేల్పుల రాజు, జి.వెంకటేష్, గోయమ్మ పాల్గొన్నారు.

# ఏజెన్సీలో విస్తారంగా వర్షం

పోలవరంలో జలమయమైన రోడ్డు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఏజెన్సీ మండలాల్లో మంగళవారం విస్తారంగా వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.

**పోలవరం:** మండలంలో సోమవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. మంగళవారం ఉదయం నుండి వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏజెన్సీలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గుంజవరం కాలువ జలాలు గుంజవరం కల్వర్టు నుండి వేగంగా ప్రవహిస్తున్నాయి. కొండవాగుల జలాలు కడమ్మ కాలువ నుండి కడమ్మ స్లూయిస్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పోలవరం పంచాయతీలో మెయిన్ బజార్, బెస్తావీధి, కొత్తపేట, బాపూజీ కాలనీ,, బిసి కాలనీలు, పట్టిసీమ పంచాయతీలో వీరభద్రపురం, కొత్త పట్టిసీమ, గూటాల ఇలా పలుచోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయి

**జీలుగుమిల్లి:**మండలంలో మంగళవారం తెల్లవారుజామునుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షాలకు రహదారులన్నీ జలమయమయ్యాయి. మండలంలోని వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

**20 నుంచి రైతు భరోసా కేంద్రాల వద్ద ధర్నాలు**
**ఎపి రైతు సంఘం జిల్లా సమావేశం పిలుపు**

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగ సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనంలో రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలను చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ భూములు కోల్పోతున్న రైతాంగానికి న్యాయమైన పరిహారం అందించాలన్నారు. పనులు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఖరీఫ్ సాగుకు సక్రమంగా సాగునీరు అందని ఈ పరిస్థితుల్లో పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా, గోదావరి డెల్టాల్లోని శివారు ప్రాంత భూములకు, మెట్ట ప్రాంత భూములకు సాగునీరందించాలని కోరారు. తాడిపూడి ఎత్తిపోతల ద్వారా ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల్లోని రైతులకు సాగునీరందించాలన్నారు. ఆయిల్ పామ్ టన్నుకు రూ.18 వేలు ధర చెల్లించాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ఆధునికీకరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుండి 30 వరకూ రైతు భరోసా కేంద్రాల వద్ద ధర్నాల నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు కట్టా భాస్కరరావు, బొడ్డు రాంబాబు, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకటరావు, బొప్పూడి రాంబాబు, వాడపల్లి రామారావు, గుండపనేని సురేష్, సిహెచ్.శ్రీనివాసరావు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## బుట్టాయగూడెంలో పోలీసుల పికెట్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలో జిల్లా ఎస్పి డి.మేరీ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు పోలీసు పికెట్ నిర్వహిస్తూ, తరచూ పోలీసు అధికారుల పర్యవేక్షణ ఉండేటట్టు చర్యలు చేపట్టారు. ఎస్పి మేరీ ప్రశాంతి ఉదార భావాలకు అనుగుణంగా మంగళవారం మధ్యాహ్నం 12.00 గంటలకు పోలవరం డిఎస్పి ఆర్ల శ్రీనివాసులు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న పులిరామడు గూడెంలోని గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల వసతి గృహంలో 125 మంది విద్యార్థులకు భోజనం చేసే స్టీల్ కంచాలు, స్టీల్ గ్లాసులు, మంచినీటి సీసా, చాక్లెట్లు, బిస్కట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం సిఐ కె.విజయ బాబు, జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వర రావు, పోలవరం ఎస్ఐ ఎస్ఎస్ఎస్ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాదంపూడిలో పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి

## స్థానికుల ఫిర్యాదుతో పూడికతీత

**ఉంగుటూరు:** బాదంపూడిలోని జడ్‌పి ఉన్నత పాఠశాల వెనుక వైపు మురుగు కాలువలోకి స్థానిక కోళ్ల పరిశ్రమ నుంచి వ్యర్థాలు కలసి దుర్వాసన వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నివారణ చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి బైర్రాజు నరసింహరాజు మంగళవారం పేర్కొన్నారు. మంగళవారం జెసిబి సాయంతో మురుగు కాలువలో వ్యర్థాలు, పూడికలను తొలగించి, పారిశుధ్య పనులను నిర్వహించామని కార్యదర్శి తెలిపారు. సంబంధిత కోళ్ల పరిశ్రమ నిర్వాహకులకు నోటీసు ఇవ్వనున్నామని తెలిపారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నామన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**భీమడోలు:** ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి భీమడోలు కేంద్రంగా పనిచేస్తున్న శాఖ సహాయ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయాన్ని డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయంగా మార్పు చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఎపి ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇ.పృథ్వీతేజకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయనను ఎంఎల్ఎ విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా క్రొవ్విడి, తోకలపల్లి, కేశవరం, రాచూరులలో ఏర్పాటు చేయమన్న 33 /11 కెవి సబ్ స్టేషన్‌లకు పరిపాలన ఆమోదం మంజూరు చేయాలని కోరారు. విద్యుత్ కోతల నివారణ, నాణ్యమైన విద్యుత్ సరఫరాలో భాగంగా గొల్లగూడెం, నిడమర్రు విద్యుత్ సబ్ స్టేషన్లు, దువ్వ, పిప్పర విద్యుత్ సబ్ స్టేషన్ల మధ్య 11/33 కెవి నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయాలని కోరారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రూ.10 వేలు

**టి.నరసాపురం:** మండలంలోని ఏపిగుంట గ్రామంలో ఇటీవల గ్యాస్ లీకైన ప్రమాదంలో దొడ్డా గంగారావుకు చెందిన ఇళ్లు దగ్ధం కావడంతో బిజెవైఎం నాయకులు తపనా చౌదరి సహకారంతో రూ.10వేలు రాజు వేగేస్న సత్రంరాజు ఆధ్వర్యంలో మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆపదలో వున్న వారిని మానవత్వంతో ఆదుకోవాలని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జట్లా రాంబాబు, మండల అధ్యక్షులు మాలంపాటి హరి చంద్ర ప్రసాద్, మండలప్రధాన కార్యదర్శి పివిఎస్ఎస్ రామలింగేశ్వర రావు, మక్కిన శ్యామ్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి 20 నుంచి రాష్ట్రవ్యాప్త ఉద్యమం

**చింతలపూడి:** మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జులై 20వ తేది నుంచి నిరాహార దీక్షలు, ధర్నాలు, కార్యాలయాల ముట్టడి చేపడతామని చింతలపూడి నగర పంచాయతీ కార్మికులు వి.పద్మ, కమల కుమారి, జి.నాగరాజు, కె.నాగరాజు, సిఐటియు మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ అకౌంటెంట్‌కు మెమోరాండం సమర్పించారు. స్థానిక నగర పంచాయతీలో కార్మిక సమస్యలు పరిష్కారం కాక అనేక సంవత్సరాల నుంచి కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని, సోదర సంఘాలతోటి కూడా చర్చించి ఆగస్టు ఒకటో తేదీ నుంచి చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమస్యలపై ఆందోళన పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## దృష్టిలోపం ఉన్నవారికి పరీక్షలు

**చింతలపూడి:** కంటి వెలుగు కార్యక్రమం ద్వారా పేదల జీవితాల్లో వెలుగు నింపే అవకాశం కలిగిందని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్కె అబ్రార్ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటి వరకూ ప్రగడవరంలో 460, తిమ్మిరెడ్డి పల్లిలో 50, వెలగలపల్లిలో 160 మందిని పరీక్షించినట్లు ఆప్తాలమిక్ అసిస్టెంట్ ఆశాజ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారికి గ్రామాల్లో దృష్టిలోపాలను పరీక్షించి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.రమ్య, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విధులు నుంచి తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకుకోకపోతే ఆందోళన చేపడతామని సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, ఎఐటియుసి మండల అధ్యక్షులు తోర్లపాటి బాబు హెచ్చరించారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం చింతలపూడి నగర పంచాయతీలో అసలే చాలీచాలని పారిశుధ్య సిబ్బంది ఉంటే 12 మందిని కొత్తవారు అన్న పేరుతో విధులకు రావద్దని కమిషనర్ ఆదేశించినట్లు సమాచారం వచ్చిందన్నారు. వీరిలో చాలామంది రెండు సంవత్సరములపై నుంచి కూడా చింతలపూడి నగర పంచాయతీలో పనిచేస్తున్నారని, వీరికి జీతం కూడా రూ.12,000 చెల్లిస్తున్నారని తెలిపారు. వీరిని వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన చేపడతామని సిఐటియు, ఎఐటియుసి నాయకులు తెలియజేశారు.

## నేరాలు - ఘోరాలు

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**నూజివీడు రూరల్:** మర్రికుంట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుర్రం రాము(35) మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై తమకు సమాచారం అందడంతో కేసు నమోదు చేశామని, రాము ఆత్మహత్యకు గల కారణాలుపై దర్యాప్తు చేస్తున్నట్లు నూజివీడు రూరల్ పోలీస్‌లు తెలిపారు.

### అక్రమ తెలంగాణ మద్యం స్వాధీనం

**చింతలపూడి:** అక్రమంగా తెలంగాణా మద్యాన్ని అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు చింతలపూడి ఎస్ఇబి సిఐ సాయి స్వరూప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో చింతలపూడి సబ్ సిబ్బంది, టి.నర్సాపురం రోడ్‌లో తొమ్మండ్రు వెంకటేశ్వర రావు అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 183 తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనికి సహకరించిన టి.నర్సాపురం గ్రామానికి చెందిన నర్లపాటి ప్రసాద్‌పై కేసు నమోదు చేశారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'

గుండుగొలనులో ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. మంగళ వారం ఆయన భీమడోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం3, రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం వీటివల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి స్థానిక సర్పంచి పి.సునీత మాన్సింగ్ వివరించారు. గుండుగొలను గ్రామంలో గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొన్నారు. గ్రామ పరిధిలో గల జగనన్న లేఅవుట్‌లో నిర్మాణాలు పూర్తి చేసుకున్న, నిర్మాణ కార్యక్రమాలు ప్రగతిలో ఉన్న 1000 ఇళ్ల కాలనీ నిర్మాణాలకు ఎంఎల్ఎ సహకరించారన్నారు. సదరు కాలనీ జిల్లాస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. కాలనీలో కొనసాగుతున్న పనుల ఆధారంగా స్థానిక మండలానికి చెందిన గృహ నిర్మాణ సంస్థ జిల్లాస్థాయిలో ఉత్తమ మండలంగా ఎంపికైందన్నారు. అనంతరం కొనసాగిన కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి చొరవతో టిడిపి నుంచి వైసిపిలో చేరేందుకు ముందుకు వచ్చిన స్థానిక ప్రముఖులు వగ్వాల అచ్యుత రామారావును ఎంఎల్ఎ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో జడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని, మండల పరిషత్ అధ్యక్షులు రామయ్య పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** ప్రజాసమస్యల పరిష్కారవేదిక సురక్ష అని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఊటుకూరులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించారు. ఈసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎన్ఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ నవరత్నాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంకా ఎవరైన అర్హులు ఉంటే వారికి లబ్ది చేకూర్చడంతో పాటు 11రకాలు సేవలందిస్తున్నామన్నారు. అనంతరం వివిధ రకాల సర్టిఫికెట్లు కోసం ధరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు డిఎన్ఆర్ ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గంటా సంధ్య, రాచూరి రాధా పాల్గొన్నారు.

**బుట్టాయగూడెం:** దొరమామిడి సచివాలయం-1లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్షలో పోలవరం ఎంఎల్ఎ తెల్లంబాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష రాష్ట్రానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. జగనన్న సురక్ష లాంటి కార్యక్రమాల ద్వారా పేదలకు ఉచితంగా పత్రాలు ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, స్థానిక సర్పంచి తెల్లం రాముడు పాల్గొన్నారు.

**నూజివీడురూరల్:** ముక్కొల్లుపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గతంలో 650 హామీలు ఇచ్చి 6 హామీలను కూడా నెరవేర్చని చరిత్ర చంద్రబాబుదని, అలాంటి వ్యక్తి ఇచ్చే హామీలను ప్రజలు ఎవరు పట్టించుకోరని అన్నారు.

## జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించే ఐరన్‌బోర్డులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరానికి చెందిన మథర్ థెరిసా ప్రథమ చికిత్సా కేంద్రం, వైఎస్ డైరీ నిర్వాహకులు, వైసిపి నాయకుడు ఎలిశెట్టి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా రూ.50 వేలతో జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారించే ఐరన్ బోర్డులు పెట్టించారు. ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు స్థానిక డివైడర్ యాక్సిడెంట్ జోన్‌గా ఉంది. ఇక్కడ వాహనాలు వేగం తగ్గించేందుకు ఈ స్టాపర్లను పెట్టించినట్లు దాత శ్రీనివాసరావు పేర్కొన్నారు. రహదారికి రెండు వైపులా వేగనియంత్రణ ఐరన్ బోర్డులను మంగళవారం పెట్టించామని ఈ సందర్భంగా తెలిపారు. వైసిపి జిల్లా కార్యదర్శి పుప్పాల గోపి, నాయకులు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిటిసి సభ్యుడు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపిపి, ఎంపిటిసీలు

## రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

**ఉంగుటూరు:** చేబ్రోలులో రూ.26 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మాణాలు దాదాపు పూర్తికావచ్చాయని వైసిపి నాయకులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు చేబ్రోలులో గతంలో పర్యటించారు. ఆసందర్భంగా గ్రామస్తులు సీసీ రోడ్డు వేయాలని అర్జీలు సమర్పించారు. స్పందించిన ఎంఎల్ఎ వాసుబాబు రూ.20 లక్షలు జిజిఎంపి నిధులు మంజూరు చేయించారు. ఉంగుటూరు మండల పరిషత్ నిధులు మరో రూ.6 లక్షలు మొత్తం రూ.26 లక్షలతో రోడ్లు నిర్మించారు. ఈనెల 19న ఎంఎల్ఎ సీసీ రోడ్లను ప్రారంభిస్తారని కరణం బుజ్జి, ఆకుల రాజా, పాపారావు, బాబ్జిలు వెల్లడించారు. మండల పరిషత్ నిధులతో చేపట్టిన రోడ్డును ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు రాయిలక్ష్మి, మనసాల నాగమణిలు పరిశీలించారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిపి శ్రీలక్ష్మి తెలిపారు.

ప్రత్యేక అవసరాలగల విద్యార్థులకు ఫిజియోథెరపి

## క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి

**ముసునూరు:** ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు క్రమం తప్పకుండా వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా వుంటారని ఫిజియోథెరఫిస్టు జి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు మండల ప్రాథమిక పాఠశాల భవిత సెంటర్ నందు ఫిజియోథెరఫిస్టు జి.ప్రశాంతి ఆధ్వర్యంలో ఫిజియోథెరఫి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.హాన్నమణి పాల్గొన్నారు.

## నూతన భవనాలు ప్రారంభించిన ఎంఎల్ఎ డిఎన్ఆర్

**కైకలూరు:** ప్రజావసరాలు తీర్చటానికి రూ.82.65 లక్షల నిధులతో మంజూరై నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేమవరప్పాడులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల ప్రారంభోత్సవం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించే ముఠా అరెస్టు

**ఉంగుటూరు:** వివిధ గ్రామాల్లో వ్యవసాయ బోరుకు సంబంధించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించి అందులో రాగిని అమ్మేసే ముఠాను మంగళవారం అరెస్టు చేసినట్లు ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు వెల్లడించారు. ఉంగుటూరు మండలంలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురైయ్యాయని గొల్లగూడెం విద్యుత్ ఉపకేంద్రం ఎఇ టి.వేణు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చేబ్రోలులో ఐదుగురుని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఉంగుటూరు, నల్లజర్ల, ద్వారకాతిరుమల, నూజివీడు, మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు పేర్కొన్నారు. దొంగతనానికి ఉపయోగించిన కారు, ఒక బైక్, కట్టర్, రంపపు బ్లేడు, 205 కేజీల రాగి వైరులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.20 లక్షలుగా ఉంటుందని తెలిపారు. వీరంతా 48 కేసుల్లో 108 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలించినట్లు తెలిపారు.

# యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో స్వచ్ఛంద రక్తదానం చేయాలంటూ అక్టోబర్ 1, 2022వ సంవత్సరం నుంచి దేశమంతటా సైకిల్ యాత్ర చేస్తున్న కలకత్తాకు చెందిన జయదేవ్ రౌత్ మంగళవారం ఏలూరు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ రక్తదాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి ఆదేశానుసారం రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, రెడ్‌క్రాస్ సిబ్బంది జయ దేవ్ రౌత్‌కి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్రకుడు జయ దేవ్ రౌత్ మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది యువత ఉన్నప్పటికీ, కేవలం కొద్ది మంది మాత్రమే స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారన్నారు. నూరు శాతం స్వచ్ఛంద రక్తదానం చేయాలని యువతకు అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్రతో దేశమంతటా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి 19 రాష్ట్రాలను పర్యటించానని, సుమారు 20వేల కిలోమీటర్లు సైకిల్ యాత్రను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ జయదేవ్ రౌత్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, ఎస్.విజయ, సౌజన్య పాల్గొన్నారు.

## జలజీవన్ నిధుల ద్వారా ఇంటింటా కుళాయి

ప్రజాశక్తి - ముసునూరు

లోపూడి శివారు బస్వావరప్పాడు గ్రామంలో రూ.27,70,000లు జలజీవన్ నిధుల ద్వారా ఇంటింటి కుళాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు లోపూడి సర్పంచి పేరం కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని బస్వావరప్పాడు గ్రామంలో గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ గ్రాంట్లు ద్వారా రూ.1.80 కి మీటరు పైపులైను, కుళాయిలకు రూ.81,600లు, బోరు, మోటారు నిర్మాణంకై రూ.4,91,619లు, ట్యాంకు నిర్మాణం రూ.6,00,000లు మొత్తం రూ.27,70,000లు జలజీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరైనట్లు ప్రాజెక్టు సూపర్ వైజరు శ్రీనివాస్, మండల ఎపిఎం కె.బాబులు తెలియజేశారు.

బస్వావరప్పాడులో జెజెయం నిధులపై గ్రామసభ..

## ఎంఎల్ఎను కలిసిన ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దుద్దుకూరు గ్రామంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజును ఇరిగేషన్ అధికారులు కలిశారు. మంగళవారం దుద్దుకూరు ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం వద్ద ఎంఎల్ఎను కలిసి ఇరిగేషన్ అధికారులు పలు సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలోని వివిధ పనులపై అధికారులుతో ఎంఎల్ఎ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఎస్ఇ కె.శ్రీనివాస్, కోటరామాచంద్రాపురం ఈఈ ఎం.రాంబాబు పాల్గొన్నారు.

## గ్లోబల్ వార్మింగ్ నివారణకు విద్యుత్ వాహనాలు

**నూజివీడు రూరల్:** గ్లోబల్ వార్మింగ్ వాయువులను తగ్గించేందుకు విద్యుత్ వాహనాలు అభివృద్ధి ఒక్కటే మార్గమని ఆర్‌జియూకెటి ఛాన్సర్ కెసి రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌జియూకెటి నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నందు మంగళవారం ఎలక్ట్రికల్ వెహికల్ డిజైన్, తయారీపై వర్క్ షాప్‌ను ఛాన్సర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యా సోలిన్, డీజిల్ దహన కారణంగా కార్బన్‌డయాక్సైడ్ విడుదలై ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన గ్లోబల్ వార్మింగ్ సమస్య ఎదురైందన్నారు. సౌర విద్యుత్ శక్తి నిర్వహణ స్థిరమైన వృద్ధికి దారితీస్తుందన్నారు. విద్యార్థులు వాహన రూపకల్పన సూత్రాలను నేర్చుకుంటూ డిజైనింగ్, తయారీ వర్క్ షాపుల ద్వారా ఈ తరహా జ్ఞానాన్ని వర్ధింపజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ నూజివీడు డైరెక్టర్ జీవిఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఉంగుటూరు:** నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ టికె విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కళాశాలను కీర్తిశేషులు, సర్వోదయ నాయకులు, మాజీ మంత్రి, విద్యాదాత చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు1972లో స్థాపించారు. ఈ నేపథ్యంలో 51వ సంవత్సరాలు పురస్కరించుకొని పూర్వ విద్యార్థులందరూ అపూర్వ సమ్మేళనం జరిపేందుకు తగిన కార్యాచరణ పై హాజరైనారు. అరవిందుని 150వ జయంతిని ఏ విధంగా నిర్వహించాలో సమావేశంలో చర్చించారు.

## వాలీబాల్ టోర్నమెంట్ విజేత తాడినాడ

**కలిదిండి:** పడమటిపాలెంలో గత మూడు రోజులుగా జరిగిన ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా తాడినాడ టీం నిలిచింది. తాడినాడ టీమ్ ప్రథమ బహుమతి, పడమటిపాలెం టీం ద్వితీయ, వెంకటాపురం టీం తతీయ బహుమతి సాధించాయి. గెలుపొందిన టీంలకు షీల్డ్‌తో పాటు, ప్రోత్సాహక నగదు బహుమతిని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

## విద్యుత్ ప్రమాద చిన్నారికి ఆర్థిక సాయం

**టి.నరసాపురం:** వెలగపాడుకు చెందిన నరదల కీర్తి కావ్యశ్రీ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురైంది. ఆస్పత్రి వైద్య ఖర్చులు నిమిత్తం ఇబ్బంది పడుతున్న విషయాన్ని కామవరపుకోట సోషల్ వర్కర్స్ టీం దృష్టికి తీసుకెళ్లగా దాతలు నుంచి సేకరించిన రూ.12 వేల 300 నగదును మంగళవారం కీర్తి తండ్రి మురళికి అందజేశారు. ఈ సందర్భంగా మురళి తన కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అవార్డుకు భీమడోలు ఎంపిక

**భీమడోలు:** జాతీయస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు కోసం భీమడోలుతో పాటు ఏజెన్సీ పరిధిలోని దొర మామిడి నామినేట్ అయ్యాయని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. భీమడోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి పి.సునీత మాన్సింగ్ అధ్యక్షత వహించారు. అతిథులుగా భీమడోలు ఎంపిడిఓ సిహెచ్ పద్మావతి దేవి, పంచాయతీ విస్తరణ అధికారి ముత్తయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ జాతీయస్థాయిలో 29 రాష్ట్రాలు, 9 కేంద్రపాలిత ప్రాంతాలు, 650 జిల్లాలు, ఒక లక్ష 39 వేల గ్రామపంచాయతీలు నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డుకు భీమడోలు నామినేట్ కావటం అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచి, గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆయన అభినందించారు. భీమడోలు గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానన్నారు. ఈ నేపథ్యంలో సదరు గ్రామపంచాయతీ జాతీయస్థాయి అవార్డుకు నామినేట్ కావటం గర్వ కారణంగా ఉందన్నారు. ఈ విషయమై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రస్తుతం నామినేట్ అయిన భీమడోలులో పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో నియమ నిబంధనల మేరకు కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామపంచాయతీని ఇతర పంచాయతీలకు ఆదర్శంగా నిలుపేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**In The Court Of The 4th Addl. Junior Civil Judge :: Kakinada**
**O.S.No. 1057/2021**

***Between:***
1) M/s. New India Assurance Co. Ltd., Rep. by its Divisional Manager, Subhadra Arced, Bhanugudi Jn. Kakinada and another. ...*Plaintiffs*
AND
Puttapudi Sri Venkata Raju and another ...*Defendants*

***TO: D-2:***
Bommana Prasad, S/o. Ramarao, Aged 35 Yrs, Driver of Lorry Bearing No. AP 16 TX 9959, R/o. Kaikaram, Unguturu, W.G.District. (Licence No. DLFAP03778602003 & Badge No.23612)

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. **24-07-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

**వేగుళ్ళ వెంకట రమణమూర్తి**
అడ్వకేట్, గాంధీ నగర్,
కాకినాడ. సెల్: 98660 33899

## CHANGE OF NAME

I, **NARAYANA REDDY SATTI (New Name)**, S/o. Satyanarayana Reddy previously called **SATTI SATYA NARAYANA REDDY (Old Name)**, Male, Aged 54 Years, Resident of Door No.10-16-17, Tallamudunurupadu, Tadepalligudem Town, W.G. Distrct, and A.P.-534102, India, solemnly declare My name **NARAYANA REDDY SATTI** in my **Passport No. K8771618** in wrongly mentioned my name **SATTI SATYANARAYANA REDDY** instead of **NARAYANA REDDY SATTI.** The Passport authorities Visakhapatnam kindly change my name as **NARAYANA REDDY SATTI.** I have applied for the change of spelling correction of Name and Surname in my Passport.

**HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT ONGOLE.**
**DISPUTE NO 21 OF 2022**

**Between :**
M/s Sri Sai Anjana Chit Funds India Pvt Ltd. Represented by its Foreman/Branch Manager, Ongole ...Disputent
**Versus**
Mekala Rajesh and Others ...Opponents
**To**
**Opp-5)** Sundru Vijaya Kumar, S/0 Yesudasu, Occ- Medical Officer, and residing at D.No 23a-7-2, Balaji Temple Street. R R Peta, Eluru

పై నెంబరు దావా యందు నీకు chit Registrar గారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున chit Registrar గారు మీకు పేపర్ ప్రకటన ద్వారా సమన్లు ఇవ్వమని ఆర్డర్ ఇచ్చినారు పై నెంబర్ దావా మీయొక్క హాజరు నిమిత్తమై తేదీ 25.07.2023నకు వాయిదా అయి యున్నది కనుక ఆరోజు ఉదయం 10:30 నిమి.లకు మీరు స్వయంగా వచ్చి chit Registrar గారి ఎదుట మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల వ్రాతపూర్వకముగా తెలియజేయవలేయును లేని యెడల నీకు పరోక్షంగాతీర్మానం చేయబడును అని తెలియజేయడమైనది

**// Order by //**
**Deputy Registrar of Chits Ongole**

## పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, తణుకు మండలం, తణుకు ఓల్డ్ టౌన్ నాకు చెందిన బెల్లపు శ్రీనివాసు **పాస్‌పోర్టు నెంబర్ S0961919** జిరాక్స్ నిమిత్తం టౌన్‌లోకి వెళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
**బెల్లపు శ్రీనివాసు**
S/o. దుర్గారావు
కొమరవరం రోడ్డు, ఓల్డ్ టౌన్, తణుకు
తణుకు మండలం
పశ్చిమగోదావరి జిల్లా -534211
సెల్: 9493460441

నోటీసు
**మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి వారు, ఏలూరు**
**O.S. No. 30/2022**

బిట్వీన్:
శ్రీ సూరె శ్రీ చంద్రశేఖరసాయి -వాది
మరియు
శ్రీ నిమ్మల విశ్వ కృష్ణ బాలాజీ మరియు అనదర్ -ప్రతివాదులు

పై నెంబరు దావాలో శ్రీ నిమ్మల విశ్వకృష్ణ బాలాజీ, తండ్రి: శ్రీ రామాంజనేయులు, డోరు నెం. 9-108, వెలమపేట, భీమడోలు, భీమడోలు మండలం, పశ్చిమగోదావరి జిల్లా అను వారు మొదటి ప్రతివాదిగాను, శ్రీ నిమ్మల లీలావతి, భీమడోలు రెండవ ప్రతివాదిగాను ఉన్నారు. మీకు శ్రీ కోర్టు వారి నుంచి ఎన్నిసార్లు నోటీసులు పంపిన మీరు తీసుకొనక కాలయాపన చేసియున్నారు. కావున ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, **ది. 02-8-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టులో మీరు గాని, లేదా మీ వకీలు ద్వారా గాని వచ్చి మీ వాదనలు తెలుపుకోవలసినదిగా కోరుచున్నాము. లేనియెడల శ్రీ కోర్టు వారు మీకు పరోక్షంగా తీర్పు వెలువబడును.

**C.A.P.SRINIVASA RAMANUJACHARYULU**
ఏలూరు **A.SIRISHA,** Advocates
ది.13-7-2023 Eluru, Cell: 9441907930

**మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు (ఎక్సైజ్) ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, వారి కోర్టులో**
**I.A.No. 214/2022**
**In O.S.No. 307/2020**

*బిట్వీన్:*
శ్రీ చిలకలపూడి రామ్ గోపాల్ ...పిటీషనరు /వాది
అండ్
మేడిడి వరప్రసాద్ (డైడ్) ...రెస్పాండెంటు /ప్రతివాది
1. మేడిడి సుగుణజ్ఞానేశ్వరి
2. మేడిడి రాధిక ...ప్రపోజ్డ్ పార్టీస్/ఎల్‌ఆర్స్ ఆఫ్ డిఫెండెంట్/ R-2 & R-3

పై నెంబరు దావాలో సెట్ ఎసైడ్ ది ఎబేట్‌మెంటు ఆర్డరు పిటీషనులో **రెస్పాండెంటు 2** మేడిడి సుగుణజ్ఞానేశ్వరి, తండ్రి: లేటు మేడిడి వరప్రసాద్, **రెస్పాండెంటు 3** మేడిడి రాధిక, తండ్రి: లేటు మేడిడి వరప్రసాద్, R/o. డో.నెం. 27-1-48, ఏటిగట్టు, అమీనాపేట, ఏలూరు, ప॥గో॥జిల్లా అను వారలకు నోటీసులు అమలు కొరకు **ది.18-08-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** సదరు వాయిదా రోజు ఉదయం గం॥ **10:30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని మీరు హాజరు అయ్యి **ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.

**కందుల కృష్ణమోహన్**
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు
19-07-2023 సెల్: 98484 83757

**మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు (ఎక్సైజ్) ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, వారి కోర్టులో**
**I.A.No. 215/2022**
**In O.S.No. 307/2020**

*బిట్వీన్:*
శ్రీ చిలకలపూడి రామ్ గోపాల్ ...పిటీషనరు /వాది
అండ్
మేడిడి వరప్రసాద్ (డైడ్) ...రెస్పాండెంటు /ప్రతివాది
1. మేడిడి సుగుణజ్ఞానేశ్వరి
2. మేడిడి రాధిక ...ప్రపోజ్డ్ పార్టీస్/ఎల్‌ఆర్స్ ఆఫ్ డిఫెండెంట్/ R-2 & R-3

పై నెంబరు దావాలో ఎల్.ఆర్.పిటీషనులో **రెస్పాండెంటు 2** మేడిడి సుగుణజ్ఞానేశ్వరి, తండ్రి: లేటు మేడిడి వరప్రసాద్, **రెస్పాండెంటు 3** మేడిడి రాధిక, తండ్రి: లేటు మేడిడి వరప్రసాద్, R/o. డో.నెం. 27-1-48, ఏటిగట్టు, అమీనాపేట, ఏలూరు, ప॥గో॥జిల్లా అను వారలకు నోటీసులు అమలు కొరకు **ది.18-08-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** సదరు వాయిదా రోజు ఉదయం గం॥ **10:30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని మీరు హాజరు అయ్యి **ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.

**కందుల కృష్ణమోహన్**
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు
19-07-2023 సెల్: 98484 83757

**మహారాజశ్రీ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్-స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు (ఎక్సైజ్) ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, వారి కోర్టులో**
**I.A.No. 213/2022**
**In O.S.No. 307/2020**

*బిట్వీన్:*
శ్రీ చిలకలపూడి రామ్ గోపాల్ ...పిటీషనరు /వాది
అండ్
మేడిడి వరప్రసాద్ (డైడ్) ...రెస్పాండెంటు /ప్రతివాది
1. మేడిడి సుగుణజ్ఞానేశ్వరి
2. మేడిడి రాధిక ...ప్రపోజ్డ్ పార్టీస్/ఎల్‌ఆర్స్ ఆఫ్ డిఫెండెంట్/ R-2 & R-3

పై నెంబరు దావాలో సెక్షన్ 5 ఆఫ్ లిమిటేషన్ యాక్టు పిటీషనులో **రెస్పాండెంటు 2** మేడిడి సుగుణజ్ఞానేశ్వరి, తండ్రి: లేటు మేడిడి వరప్రసాద్, **రెస్పాండెంటు 3** మేడిడి రాధిక, తండ్రి: లేటు మేడిడి వరప్రసాద్, R/o. డో.నెం. 27-1-48, ఏటిగట్టు, అమీనాపేట, ఏలూరు, ప॥గో॥జిల్లా అను వారలకు నోటీసులు అమలు కొరకు **ది. 18-08-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** సదరు వాయిదా రోజు ఉదయం గం॥ **10:30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని మీరు హాజరు అయ్యి **ఆక్షేపణలు తెలుపుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.

**కందుల కృష్ణమోహన్**
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు
19-07-2023 సెల్: 98484 83757